
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 3
శనివారం 22 జూన్ 2024





అసెంబ్లీలో సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న మంత్రి టీజీ భరత్



ప్రణామం.. ప్రమాణం..

- చంద్రబాబు సారథ్యాన కొలువుదీరిన అసెంబ్లీ
- ప్రమాణ స్వీకారం చేసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- ముందుగా మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూక్
- కుటుంబ సభ్యులు, సహచరులతో సందడి



బీవీ జయ నాగేశ్వర రెడ్డి



బొగ్గుల దస్తగిరి



కేతా శ్యాంబాబు



పార్థసారథి



బాలనాగి రెడ్డి



విరుపాక్షి



కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి



గౌరు చరిత



బుడ్డా రాజశేఖర రెడ్డి



భూమా అఖిలప్రియ



జయ సూర్య





ప్రమాణ స్వీకారం చేస్తున్న మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్



కర్నూలు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో చంద్రబాబు సారథ్యాన శాసనసభ శుక్రవారం కొలువుదీరింది. సభా నాయకులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్ సహా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి చేరుకున్నారు. వారి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, సహచరులు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. ముందుగా నిర్ణయించిన శుభ ముహూర్తానికి సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాన్ని టీవీల్లో వీక్షిస్తూ ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన టీడీపీ శ్రేణులు, అనుచరగణాలు సంబరాలు చేసుకున్నాయి. అసెంబ్లీలో సమస్యలపై గళం విప్పుతాం.. నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని తమ మనోగతాన్ని వెల్లడించారు.

ముందుగా మంత్రులు...

సభా నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ చేత ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎమ్మెల్యేగా ప్రమాణాస్వీకారం చేయించారు. ఆ తరువాత మంత్రులు ఒక్కొక్కరిగా ప్రమాణం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్ ప్రమాణ స్వీకారం చేశారు. తరువాత అక్షర క్రమంలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో టీడీపీకి చెందిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి, వైసీపీకి చెందిన మంత్రాలయం ఎమ్మెలే వై.బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో బాలనాగిరెడ్డి నాలుగో సారి, బీవీ జయనాగేశ్వరరెడ్డి రెండో సారి ప్రమాణ స్వీకారం చేస్తే.. మిగిలిన ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. నంద్యాల పార్లమెంట్ నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మూడవ పర్యాయం, ఆళ్లగడ్డ, శ్రీశైలం ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలు రెండవసారి ప్రమాణ స్వీకారం చేస్తే.. డోన్, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే.. కోట్ల మూడు పర్యాయాలు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన చరిత్ర ఉంది.



అసెంబ్లీలో ముందు వరుసలో కూర్చున్న మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి

ప్రగతి సాధిస్తాం

అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టడం ఆనందంగా ఉందని వివరించారు. తొలిసారిగా గెలిచి అసెంబ్లీకి వెళ్లిన కొత్త ఎమ్మెల్యేలు సంతోషం మాటల్లో చెప్పలేమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సమస్యలపై అసెంబ్లీలో వినిపిస్తాం.. అదే క్రమంలో మా అధినేత, సీఎం చంద్రబాబు, సంబంధిత మంత్రులు దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలో ప్రగతి చేసి చూపిస్తాం అని పేర్కొన్నారు. అదే క్రమంలో ప్రమాణ స్వీకరం అనంతరం అసెంబ్లీలోనూ, బయట కుటుంబ సభ్యులు, అనుచరులు, సహచర మిత్రులతో కలసి సందడి చేశారు. వెలగడిపూడి అసెంబ్లీ, సచివాలయాల వద్ద ఫొటోలు దిగారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేసిన వారు చంద్రబాబుతో పాటు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి అభివాదం చేశారు.



ప్రొటెం స్పీకర్‌తో మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



అసెంబ్లీలో ఆశీనులైన పత్తికొండ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, జయనాగేశ్వర్ రెడ్డి









కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన యోగా ఆసనాల్లో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

యోగా ఒక జీవన విధానం

- ఎంపీ బస్తిపాటి నాగరాజు
- జిల్లా వ్యాప్తంగా యోగా దినోత్సవం
- ఆకట్టుకున్న యోగాసనాలు
- సామూహిక యోగా సాధన చేసిన అధికారులు, ప్రజలు

కర్నూలు కల్చరల్/కర్నూలు హాస్పిటల్, జూన్ 21: యోగా వ్యాయామం కాదని, అదో ఆరోగ్య జీవన విధానమని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప సంపద యోగ అని, ఆరోగ్య సంరక్షణకు యోగాను మించిన మార్గం మరొకటి లేదన్నారు. శుక్రవారం పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాభ్యాసనాలు, ధ్యానం, ప్రాణాయామం వంటివి ఆచరించారు. భవిష్యత్తులోనూ ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని సూచించారు. కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆయుష్ శాఖ, కర్నూలు నగర పాలక సంస్థ యోగా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. యోగా సాధకులు, పాఠశాల విద్యార్థులతో సామూహికంగా యోగసనాలు, కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానం వంటి కార్యక్రమాలు చేయించారు. యోగా సాధకులు నృత్యంతో కూడిన యోగాసనాలు చూపరులను ఆకట్టుకున్నారు.



యోగాసనాలు చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు


యోగా ద్వారా మానసిక ప్రశాంతత

జిల్లా న్యాయ ప్రధాన అధికారి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు లీగల్: యోగాసనాల ద్వారా ఆరోగ్య పరిరక్షణ కలిగి మానసిక ప్రశాంతత కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు తెలియజేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

యోగాతో ఆరోగ్యం : ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పోలీసులకు మానసిక, శారీరక ధృఢత్వం సాధించడానికి యోగా అవసరమని, యోగాతో ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.



యోగా చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

జిల్లా అంతటా ఏరువాక సంబరాలు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 21 : రైతులకు అతి ముఖ్యమైన పండుగ ఏరువాక. తమ జీవనాన్ని మెరుగు పరుచుకునేందుకు వ్యవసాయాన్ని అనాదిగా చేస్తూ వస్తున్న అన్నదాతలు ఏరువాక పున్నమి నుంచి వ్యవసాయ పనులను ప్రారంభించడం సాంప్రదాయకంగా వస్తుంది. ఇందులో భాగంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెద్ద ఎత్తున ఏరువాక పండుగను రైతులు చేపట్టి సంబరాలు చేసుకున్నారు. కాడెద్దులకు రంగులు పూసి, పూలదండలు వేసి వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి టెంకాయలు కొట్టి పొలాల్లో పనులు ప్రారంభించే కార్యక్రమాన్ని ఎంతో సంతోషంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పెద్ద ఎత్తున రైతులు జరుపుకున్నారు.



ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో ఏరువాక పున్నమి సందర్భంగా రైతులు ఎద్దులను ఇలా అలంకరించి పారువేట పోటీలను నిర్వహించారు.

ఇసుక పంచాయితీ..!

- ఏపీ భూ భాగంలోకి చొరబడిన ఇసుకాసురులు
- అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా
- అడ్డుకున్న ఆర్.కొంతలపాడు, సుంకేసుల రైతులు
- మూడేళ్లుగా సాగుతున్న దందా
- స్పందనలో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం
- జరిమానాతో సరిపెట్టిన అధికారులు
- గతంలో మునగాలపాడు వద్ద ఇదే తరహా వివాదం

కర్నూలు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు రూరల్:

తుంగభద్ర నదిలోని ఆంధ్రప్రదేశ్ భూభాగం అది. కర్నూలు, కపడ జిల్లాల రైతుల జీవనాడి అయిన సుంకేసుల జలాశయానికి అతి సమీపంలో ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాల దగ్గర నాణ్యమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. డ్యాం భద్రత, తాగు, సాగునీటి పథకాల సంరక్షణ దృష్ట్యా ఏపీ ప్రభుత్వం అక్కడ ఇసుక రీచ్‌లకు అనుమతి ఇవ్వలేదు. నది ఆవలి ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం తూర్పు గార్లపాడు వద్ద ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చింది. ఆ ముసుగులో ఏపీలో ఉన్న ఇసుకపై కన్నేసిన తెలంగాణ ఇసుకాసురులు అనుమతి పేరిట అక్రమ తవ్వకాలకు సై అన్నారు. మూడేళ్లుగా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. స్పందనలో ఆయా గ్రామాల రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. శుక్రవారం పదుల సంఖ్యలో తెలంగాణ ట్రాక్టర్లు తమ సరిహద్దు దాటి ఏపీ పరిధిలోని తుంగభద్ర నదిలోకి చొచ్చుకు రావడం చూసిన ఆర్.కొంతలపాడు, సుంకేసులు గ్రామాల రైతులు అడ్డుకున్నారు. జిల్లా కలెక్టరు డాక్టరు జి.సృజన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు వాస్తవమేనని నిగ్గుతేల్చారు. జరిమానాతో సరిపెట్టారు. మరోసారి తెలంగాణ గ్రామాల వ్యక్తులు ఏపీ భూభాగంలోకి ఇసుక కోసం చొరబడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఆంధ్ర సరిహద్దు నుంచి తరలిస్తుండగా అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

రైతుల ఫిర్యాదుతో కదిలిన అధికారులు

జిల్లాలో ఏపీ భూ భాగంలో చొరబడి తెలంగాణకు చెందిన వ్యక్తులు పదుల సంఖ్యలో ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే.. ఆర్.కొంతలపాడు సర్పంచ్ కె.మహానంది, సుంకేసులు మాజీ ఎంపీటీసీ కె.శ్రీరాములుతోపాటు పలువురు రైతులు తెలంగాణ ఇసుక ట్రాక్టర్లు, తవ్వకాలను అడ్డుకున్నారు. జిల్లా కలెక్టరు డాక్టరు జి.సృజనకు ఫిర్యాదు చేశారు. మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలు ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు డాక్టర్ సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌ల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరు ఆదేశాల మేరకు కర్నూలు రూరల్ తహసీల్దారు రామాంజులనాయక్, తాలుకా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీధర్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, వీఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీ భూభాగంలో ఇసుక ఇసుక అక్రమంగా తవ్వకాలు వాస్తవమేనని నిర్ధారించారు. ఇసుక రవాణా చేస్తున్న 51 ట్రాక్టర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ వైపు నుంచి రాజోలి మండలం తహసీల్దారు, ఎస్‌ఐలు కూడా అక్కడికి చేరుకున్నారు. తుంగభద్ర నదిలో సరిహద్దులను పరిశీలించి ఏపీ సరిహద్దులో ఇసుక తవ్వకాలు నిజమేనని నిగ్గుతేల్చారు.



తుంగభద్ర వద్ద ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామస్థులు

రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం

జిల్లాలో కర్నూలు రూరల్ మండలం ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాలు, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం రాజోలి, చిన్న దనవాడ, తుమ్మలపల్లె, రాజోలి, తూర్పు గార్లపాడు గ్రామాల మధ్య తుంగభద్ర నది ప్రవహిస్తుంది. నదిపై ఇరు రాష్ట్రాలకు హక్కు ఉంది. అయితే.. ఏ రాష్ట్రం భూ భాగంలో ఉన్న ఇసుకను ఆ రాష్ట్రం గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం వినియోగించుకోవాలి. ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాల సమీపంలో తుంగభద్ర నది ఏపీ భూ భాగం పరిధిలో నాణ్యమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. అయితే.. ఈ నిల్వలకు అతి సమీపంలో సుంకేసుల డ్యాంతోపాటు తాగునీరు, సాగునీటి పథకాలు ఉండడంతో ఇసుక రీచ్‌లకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. నది ఆవలి ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం రాజోలి మండలం తూర్పు గార్లపాడు గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చింది. ఆ రాష్ట్ర భూ భాగంలో ఇసుక తవ్వకాలు చేస్తే ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదు. తెలంగాణ భూ భాగంలో ఇసుక నిల్వలు ఖాళీ అయినా.. ఆ రాష్ట్ర శాండ్ యాప్‌లో రాయల్టీ చెల్లించి.. ఆ ముసుగులో కర్నూలు జిల్లాలోని ఏపీ భూ భాగంలోకి చొరబడి అక్రమంగా ఇసుక తవ్వకాలు మూడేళ్లుగా తెలంగాణ వ్యక్తులు సాగిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాలని ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాల రైతులు పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. కారణం.. తెలంగాణ ఇసుక అక్రమార్కులకు కర్నూలు జిల్లాకు చెందిన కొందరు వైసీపీ నాయకులు, అధికారుల అండ ఉండడమే.

రెండు జిల్లాల కలెక్టర్ల చర్చలతో వివాదానికి తెర

కర్నూలు జిల్లా కలెక్టరు డాక్టరు జి.సృజన, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరు బీఎం సంతోష్‌లు ఈ వివాదంపై చర్చించారు. భవిష్యత్తులో ఈ సమస్య మళ్లీ ఉత్పన్నం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని గద్వాల జిల్లా కలెక్టరును కర్నూలు జిల్లా కలెక్టరు కోరారు. అందుకు ఆ కలెక్టరు సానుకూలంగా స్పందించారు. ధనాపేక్షతో స్వార్థపరులు సాగించిన ఇసుక తవ్వకాలు కారణంగా అంతర్ రాష్ట్ర సరిహద్దు వివాదం తలెత్తకుండా ఇరు జిల్లాల కలెక్టరు తీర్థయం తీసుకోవడంతో ఈ వివాదానానికి తెర పడింది. అనుమతి పేరిట ఏపీ భూ భాగంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న తెలంగాణకు చెందిన ఒక్కో ట్రాక్టరు యజమాని నుంచి రూ.5 వేల జరిమానా వసూలు చేశారు. ముున్ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఇసుక నిల్వలు ఉన్న ప్రాంతాల్లో సరిహద్దు సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయాలని, అప్పటికీ వాటిని దాటి వచ్చి ఇసుక తవ్వకాలు సాగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు పేర్కొన్నారు.





రాష్ట్ర సరిహద్దులో ట్రాక్టర్లతో వస్తున్న తెలంగాణ వాసులు

గతంలోనూ సరిహద్దు వివాదాలు

తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలపై గతంలోనూ ఇరు రాష్ట్రాల గ్రామాలకు చెందిన ఇసుక రవాణాదారుల మధ్య సరిహద్దు వివాదాలు తలెత్తాయి. కర్నూలు మండలం మునగాలపాడు, తెలంగాణలోని మానవపాడు మండలం కల్లూరు, కలుగోట్ల గ్రామాల ఇసుక రవాణాదారుల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ కూడా జరిగింది. అదే క్రమంలో కౌతాళం మండలం మరళి వద్ద ఏపీ సరిహద్దులోని ఇసుక రీచ్‌లోకి.. నది అవలి ఒడ్డున ఉన్న కర్ణాకట రాష్ట్రానికి చెందిన వ్యక్తులు చొరబడి ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు చేస్తుంటే గుర్తించిన జిల్లా అధికారులు కేసులు నమోదు చేశారు.

తుంగభద్రలో సరిహద్దులు ఏర్పాటు చేశాం



ఆర్.కొంతలపాడు, సుంకేసుల దగ్గర తెలంగాణ వ్యక్తులు ఏపీ భూ భాగంలో ఇసుక తవ్వకాలు చేసి రవాణా చేస్తున్నారని కలెక్టరు డాక్టర్ జి.సృజనకు ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరు ఆదేశాల మేరకు తనిఖీ చేశాం. తెలంగాణ రాష్ట్రం తూర్పు గార్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తులు 100 మీటర్లకు పైగా ఏపీ భూ భాగంలోకి వచ్చి ఇసుక తవ్వకాలు చేసినట్లు గుర్తించి 51 ట్రాక్టర్లు అదుపులోకి తీసుకున్నాం. ఒక్కో ట్రాక్టరు నుంచి రూ.5 వేలు అపరాద రుసుం వసూలు చేశాం. ఈ సమస్య మళ్లీ తలెత్తకుండా సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేశాం.

- రామాంజుల నాయక్, తహసీల్దార్, కర్నూలు రూరల్:

స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



సుంకేసుల ప్రాజెక్టుకు దిగువన డ్యాం సమీపంలో మన భూ భాగం తుంగభద్ర నదిలో ఇసుక నిల్వలు ఉన్నాయి. ఆవలి ఒడ్డున తెలంగాణ గ్రామాల వ్యక్తులు అక్రమంగా ఇసుకను తవ్వేస్తున్నారు. ఐదారు గ్రామాల సర్పంచులు, రైతులు గతంలో స్పందనలో ఫిర్యాదులు చేసినా, జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మూడేళ్లుగా ఈ భాగోతం సాగుతుంది. ఇక్కడి వైసీపీ నాయకులు కొందరు, పోలీసు అధికారుల అండతోనే తెలంగాణ వ్యక్తులు రెచ్చిపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టరు సృజన స్పందించడం అభినందనీయం.

- కె.మహానంది, ఆర్.కొంతలపాడు సర్పంచ్,

డ్యామ్‌కు ప్రమాదం పొంచి ఉంది



కరువు పల్లె జీవనాడి సుంకేసులు ప్రాజెక్టు. ఈ డ్యాంకు అతి సమీపంలో ఏపీ పరిధిలో తెలంగాణకు చెందిన వ్యక్తులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇసుక నిల్వలు ఉన్న ప్రాంతంలోనే దేవమ్మ మడుగు ఉంది. ఒకప్పుడు కర్నూలు ప్రజల దాహం తీర్చింది. తెలంగాణ వ్యక్తులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటి పథకాలు ఒట్టిపోయే ప్రమాదం ఉంది. సుంకేసుల డ్యాంకు కూడా ముప్పు పొంచి ఉంది.

- కె.శ్రీరాములు, సుంకేసులు మాజీ ఎంపీటీసీ, కర్నూలు మండలం

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి

నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ



సమీక్షలో ఏడీఆర్, డీఏవోలు

నంద్యాల టౌన్, జూన్ 21 : వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ అన్నారు. శుక్రవారం ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ - సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్‌లో పంటల విస్తీర్ణం, పంటల సాగులో చేపట్టాల్సిన వివిధ యాజమాన్య పద్ధతులు, వివిధ పంటల్లో అత్యధిక దిగుబడి ఇచ్చే వంగడాలు, పంటల సరళి, తదితర అంశాలపై ఏడీఆర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కర్నూలు జిల్లా వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ జిల్లాలో 140 హెక్టార్లలో మొక్కజొన్న, 155 హెక్టార్లలో సజ్జ, 902 హెక్టార్లలో కంది, 165 హెక్టార్లలో మినుము, 2798 హెక్టార్లలో వేరుశనగ, 24816 హెక్టార్లలో పత్తి, 192 హెక్టార్లలో మిరపను రైతులు సాగు చేశారని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, మినుము, కంది, పొగాకు, వేరుశనగ పంటలను 23 వేల హెక్టార్లలో సాగు చేశామని అన్నారు. సాధారణ వర్షపాతం నమోదైందని, అందుకు అనుగుణంగా వివిధ డివిజన్‌లలో సాగు చేసిన పంటల విస్తీర్ణం, వర్షపాతం నమోదు వివరాలను వెల్లడించారు. వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ఎన్‌డీఎల్ఆర్ -7, ఎంటీయూ -1271, బీపీటీ - 2846 రకాలు అగ్గి తెగుళ్లను తట్టుకొని, గాలి, వానలకు గింజ రాలకుండా అధిక దిగుబడిని ఇచ్చే రకాలను రైతులు ఎంపిక చేసుకోవాలని అన్నారు. పొగాకు శాస్త్రవేత్త డాక్టర్ ఫుల్లిబాయి మాట్లాడుతూ పొగాకు నారు పోసుకోవడానికి జూలై 2వ వారం, నారు నాటుకోవడానికి ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 15 వరకు అనుకూలమని తెలిపారు. పత్తి శాస్త్రవేత్తలు డాక్టర్ మోహన్‌కృష్ణ, డాక్టర్ లక్ష్మీకళ్యాణి, డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేయాల్సిన రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యవసాయాధికారులు, సిబ్బంది, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేత

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 21: 2024 సార్వత్రిక ఎన్నికల్లో విధులకు గైర్హాజరైన ఉద్యోగ ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

'మాన్‌సూన్' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 21: వాణిజ్య బ్యాంకులకంటే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖల్లో రైతులతో పాటు ఇతర వర్గాల ప్రజల జీవనోపాధి, పంటల సాగుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతోందని కృష్ణానగర్ సహకార బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు సహకార బ్యాంకుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సహకార బ్యాంకును అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా మాన్‌సూన్ డిపాజిట్ పథకాన్ని 444 రోజుల కాలపరిమితికి లోబడి అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ డిపాజిట్ పథకం వల్ల సీనియర్ సిటిజన్లకు 8.8 శాతం వడ్డీ, అదేవిధంగా 60ఏళ్లలోపు వారికి 8.30 శాతం వడ్డీని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

టీడీపీ నేత హత్య కేసులో మరో ఆరుగురి అరెస్టు

వెల్దుర్తి, జూన్, 21: వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె టీడీపీ కార్యకర్త గిరినాథ్ చౌదరి హత్య కేసులో మరో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఎన్నికల సందర్భంగా టీడీపీ-వైసీపీ వర్గాల నడుమ చోటుచేసుకున్న వివాదం మే 13న హత్యకు దారి తీసిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన మోదుపల్లి గిరినాథ్ చౌదరి తన తమ్ముడు కళ్యాణచక్రవర్తితో కలిసి దళితవాడ వైపు వెళ్తున్న సమయంలో వైసీపీ వర్గీయులు వేటకొడవళ్లతో దాడి చేశారు. గిరినాథ్‌చౌదరి అక్కడికక్కడే మృతిచెందగా ఆయన తమ్ముడు కళ్యాణచక్రవర్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా గత వారంలో ప్రధాన నిందితులైన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సామూహిక మరుగుదొడ్డిని తొలగించి ఇంటి నిర్మాణం

- శివవరంలో వైసీపీ నాయకుల దుశ్చర్య
- నిరసనకు దిగిన మహిళలు

అవుకు, జూన్ 21: అవుకు మండలం శివవరం గ్రామం ఎస్సీ కాలనీలోని సామూహిక మరుగుదొడ్డిని కూల్చివేసి వైసీపీ నాయకులు ఏకంగా ఇంటిని నిర్మించుకున్నారు. దీంతో శుక్రవారం గ్రామానికి చెందిన మహిళలు కనకమ్మ, మరియమ్మ, రాణి, భారతి, భాగ్యలత, రత్నమ్మ తదితరులు నిర్మాణం జరుగుతున్న ఇంటి ముందే నిరసనకు దిగారు. మరుగుదొడ్డిని తొలగించి ఆ స్థానంలో ప్రభుత్వ కార్యాలయాన్ని నిర్మిస్తామని వైసీపీ నాయకులు నమ్మబలుకుతూ వచ్చారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తీసుకవచ్చి 2023 మార్చి 10వ తేదీన అవుకు తహసీల్దార్‌తో గ్రామానికి చెందిన గుత్తి లళితమ్మ పేరు మీద పొజిషన్ సర్టిఫికేట్ తీసుకున్నారు. పంచాయతీ కార్యాదర్శితో ఎలాంటి అప్రూవల్ తీసుకోకుండా ఇంటి నిర్మాణం చేపట్టారు. దాదాపు 90శాతం ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. వైసీపీ అధికారంలో ఉండటంతో బాధిత మహిళలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి టీడీపీ అధికారంలోకి రావటంతో గ్రామ పెద్దల సహకారంతో మహిళలు తరలివచ్చి నీళ్ల చెంబులు చేత పట్టుకొని నిరసనకు దిగారు. బహిర్భూమికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పట్టనట్లు వ్యవహరించటం వైసీపీ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. అయితే అప్పటికే గుత్తి లళితమ్మ కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తీసుక వచ్చింది. బాధిత మహిళలు పంచాయతీ సెక్రటరీ మునీరాకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయటంతో ఇంటి నిర్మాణం జరుపుతున్న గుత్తి లళితమ్మకు ఈ నెల 11వ తేదీన నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇరువర్గాల మహిళలు వాదోపవాదాలకు దిగటంతో ఎస్ఐ కిరణ్‌బాబు శివవరం చేరుకొని ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని గుత్తి లళితమ్మను హెచ్చరించారు. ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించి బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ముందు హాజరు పరచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



మరుగుదొడ్డి స్థానంలో నిర్మించిన ఇంటి వద్ద నిరసనకు దిగిన మహిళలు

బాలల వసతి గృహం తనిఖీ



పరిశీలన గృహంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(లీగల్), జూన్ 21: స్థానిక బాలల వసతి గృహం, వన్‌స్టాప్ సెంటర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న వారికి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ యాక్టు ద్వారా మహిళలకు, పిల్లలకు ఉచిత న్యాయ సహాయాన్ని తాము అందజేస్తామన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ, జూనియర్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుబ్బయ్య, న్యాయవాది బి.లక్ష్మీనారాయణ, పరిశీ లన గృహం సూపరింటెండెంట్ హుశేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

భర్తతోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల, జూన్ 21: మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామానికి చెందిన తలారి కవితను భర్త రమేష్, మరో ముగ్గురు అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప శుక్రవారం తెలిపారు. మూడేళ్ల క్రితం గోస్పాడు మండలం ఆలమరు రమేష్‌తో కవితకు వివాహమైంది. వీరి కాపురం కొంత కాలంగా సవ్యంగా సాగింది. వివాహ సమయంలో కట్నకానుకలను కవిత తల్లిదండ్రులు అందజేశారు. అయితే భర్త రమేష్, మామ వెంకటేశ్వర్లు, అత్త తిరుపాలమ్మ, బావ చంద్రశేఖర్ అదనపు కట్నం తీసుకు రావాలని కవితను తరచూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

అవుకులో చోరీ

అవుకు, జూన్ 21 : అవుకు పట్టణం అమ్మశాల ఆలయం సమీపంలోని షణ్ముఖ ఫ్యాన్సీ దుకాణంలో శుక్రవారం తెల్లవారు జామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. దుకాణం షట్టరు తాళాలు పగులగొట్టి దాదాపు రూ.3 లక్షల విలువ చేసే సిగరెట్ బండిల్స్, రూ.80 వేల నగదును దోచుకెళ్లినట్లు బాధితుడు పసుపల సుబ్రమణ్యం తెలిపారు. ఎస్ఐ కిరణ్‌బాబు పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ఆత్మకూరు, జూన్ 21: ఆత్మకూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఈ నెల 17వ తేదీన చోటు చేసుకున్న షేక్ ఖాదర్‌వలి(20) హత్య కేసు నిందితుడు గువ్వలకుంట్ల ఫరూక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ముర్తుజావలి, హుసేన్‌బాషా, ముజీబ్, ఆత్మకూరుకు చెందిన షేక్షావలి, రఫీక్, రసూల్, కురుకుందకు చెందిన ఫరూక్ అందరూ హైదరాబాద్‌లో ఖవ్వాబన్ వ్యాపారం చేస్తూ ఈ నెల 16వ తేదీన ఆత్మకూరుకు టాటాఏసీ వాహనంలో బయలుదేరారు. వాహనం ముందు సీటులో కుర్చునే విషయంలో ముర్తుజావలికి, ఫరూక్ మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలోనే 17వ తేదీ రాత్రి 9.30గంటల సమయంలో ముర్తుజావలికి ఫరూక్ ఫోన్ చేసి నానా విధాలుగా దుర్భాలాషలాడారు. దీంతో పక్కనే ఉన్న అతని స్నేహితుడు ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఖాదర్‌వలి ఫోన్ తీసుకుని ఎందుకు తిడుతున్నావని ఫరూక్‌ను ప్రశ్నించాడు. దీంతో అతడిని కూడా బూతులు తిట్టి దమ్ముంటే కురుకుందలోని కొట్టాలచెరువు రోడ్డు వైపు రావాలని సవాల్ విసిరాడు. దీంతో వారు 10.30గంటలకు ఖాదర్‌వలి కురుకుంద వెళ్లగా అక్కడ ఖాదర్‌వలికి, ఫరూక్‌కు మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరిగి అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో ఖాదర్‌వలి ఎడమ వైపు చాతిలో ఫరూక్ పొడవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తండ్రి షేక్ మాలిక్ ఫిర్యాదు చేయడంతో ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై వెంకటనారాయణరెడ్డిలు విచారణ చేపట్టి నిందితుడైన గువ్వలకుంట్ల ఫరూక్‌ను శుక్రవారం కురుకుంద సమీపంలోని హైస్కూల్ వద్ద అరెస్టు చేశారు. కాగా పట్టుబడిన నిందితుడిని ఆత్మకూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 సావిత్రీబాయి



సావిత్రీబాయిని అభినందిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 21: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రెగ్యులర్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1గా ఎస్.పి. సావిత్రీబాయికి పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లకు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డా.నరసింహం జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించారు. కర్నూలు జీజీహెచ్‌లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పని చేస్తున్న సావిత్రీబాయి, జి.నాగమణిలకు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్లు పదోన్నతి లభించింది. సావిత్రీబాయిని కర్నూలు జీజీహెచ్‌కు జి.నాగమణిని అనంతపురం జీజీహెచ్‌కు పోస్టింగ్ చేస్తూ డీఎంఈ ఆదేశాలు జారీ చేసింది. కర్నూలు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన సావిత్రీ బాయిని సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఆసుపత్రిలో నర్సింగ్ సేవలను మెరుగుపరచాలని నూతన నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీ గవర్నమెంటు నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.మంజులాదేవి పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన బీటీ నాయుడు



డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జూన్ 21: పోలీస్ శాఖలో అనుభవం ఉన్న అధికారి రాష్ట్రానికి అవసరమని శాసన మండలి సభ్యుడు బీటీ నాయుడు అన్నారు. శుక్ర వారం విజయవాడలో నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

చంద్రబాబును కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న దస్తగిరి

కర్నూలు(రూరల్), జూన్ 21: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబా బునాయుడుని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శుక్రవారం మర్యా ద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీలోకి తొలిసారిగా అడుగుపెట్టిన దస్తగిరి కోడుమూరు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సాయంత్రం 5గంటలకు కోడుమూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డితో కలిసి దస్తగిరి సీఎం చాంబర్‌లో చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ, బీసీ సంక్షేమ శాఖల మంత్రులు పయ్యావుల కేశవ్, సవితను దస్తగిరి మర్యాద పూర్వకంగా కలిశారు.

ఒలింపిక్ టీ షర్టు లోగో ఆవిష్కరణ



ఒలింపిక్ టీ షర్టు లోగోను ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 21: కర్నూలులో ఈ నెల 23న జరిగే ఒలింపిక్ డే రన్‌కు సంబంధించి టీ షర్టు లోగోను మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆవిష్కరించారు. శుక్రవారం మౌర్యఇన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు క్రీడా సంఘం ప్రతినిధులు సి.హర్షవర్దన్, దాసరి సుధీర్, గంగాధర్, జాఫర్, మున్నా, వేణుగోపాల్, షేక్ నబీ సాహేబ్, నాగరత్నమయ్య, విజయకుమార్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి ఈసీజీ మిషన్ విరాళం

కర్నూలు(హాస్పిటల్), జూన్ 21: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్న పిల్లల విభాగంలో అడ్మిట్ అయిన ఓ రోగికి అత్యవసరంగా ఈసీజీ తీయడానికి ఆ యంత్రం లేకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డామని అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీలత ఈ విషయాన్ని వాట్సాప్ ద్వారా సూపరింటెండెంట్‌కు తెలిపింది. ఈ విషయాన్ని అమెరికా చికాగోలో ఉన్న పూర్వ విద్యార్థి నియోనాటాలజిస్టు డాక్టర్ రామమోహన్ కొప్పర్తి ముందుకు వచ్చి ఈసీజీ మిషన్‌ను విరాళంగా అందించారు. రామమోహన్ కొప్పర్తికి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఏఎన్‌ఐ వైద్యుడు పంపించిన ఈసీజీ మిషన్‌ను శుక్రవారం చిన్నపిల్లల విభాగపు ప్రొఫెసర్ డా.జి.శారదకు సూపరింటెండెంట్ అందించారు. త్వరలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఏఎంసీ విభాగానికి 1964 బ్యాచ్ పూర్వ వైద్యవిద్యార్థి ఏఎన్‌ఐ డాక్టర్ రంగారెడ్డి రూ.12 లక్షల విలువ చేసే 12 ఈసీజీ మానిటర్లు ఇవ్వడానికి అంగీకరించారని సూపరింటెండెంట్ తెలిపారు. అలాగే త్వరలో ఏర్పాటు అవుతున్న క్యాజువాలిటీకి 20 పడకలు ఇవ్వడానికి కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి విరాళంగా ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిపారు.

సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

సి.బెళగల్, జూన్ 21: సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని ఈవోఆర్డీ సందీప్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఈర్లదిన్నె, ముడుమాల, కొత్తకోట గ్రామాల్లోని సచివాలయా లను ఆయన తనిఖీ చేసి హాజరు రిస్టర్లను పరిశీలించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం ఉదయం కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆయుష్ శాఖ, కర్నూలు నగర పాలక సంస్థ యోగా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగాసాధకులు విద్యార్థులతో యోగసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. ముఖ్యఅతిథిగా కర్నూలు ఎంపీ పాల్గొని మాట్లాడారు.

● **మానసిక ఒత్తిడి తగ్గుతుంది:** ప్రతి నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని జిల్లా రెవెన్యూ అధికారి కే.మధుసూదన్‌రావు అన్నారు. అనంతరం యోగా గురువు విజయ్‌ను ఆయన అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యోగాసనాలు వేసిన కల్లూరుకు చెందిన కుమారి ప్రసన్న ఎంపీ, డీఆర్వో జ్ఞాపికలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ యోగా సంఘం సభ్యుడు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి, జిల్లా ఆయుష్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, యోగా నేచురోపతి మెడికల్ ఆఫీ సర్ ప్రసాద్, ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ ద్వారం ప్రభాకర్ రెడ్డి, డీఎస్‌డీవో భూపతిరావు, డీపీవో నాగరాజనాయుడు, హౌసింగ్ పీడీ సిద్ధలింగ మూర్తి, ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ చైర్మన్ డి.లక్ష్మీకాంతరెడ్డి, సెట్కూరు సీఈవో రమణ, డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్, ఎన్‌సీసీ బెటాలియన్ అడ్మిన్ ఆఫీసర్ మేనేజర్ శశికుమార్, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, జిల్లా యోగా సంస్థ, జిల్లా ఆరోగ్యభారతి శాఖ, ఎన్‌సీసీ, ఎన్ ఎస్ఎస్, ఏపీఎస్‌పీ, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు పాల్గొన్నారు.

● ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం ఈషా ఫౌండేషన్ యోగా గురువులు వశిష్ట భార్గవి, శిరీష ఆధ్వర్యంలో వైద్యవిద్యార్థులు యోగాసనాలు వేశారు. కేఎంసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

● నగరంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో రాయలసీమ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. యోగా శిక్షకులు రామచంద్రయ్య యోగా ప్రాముఖ్యతను వివరించారు. రాయలసీమ డెంటల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా.రాయపు రామచంద్రారెడ్డి, జి.పుల్లారెడ్డి, డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వై.మురళిధర్ రెడ్డి, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ నరేష్ పాల్గొన్నారు.

● కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువు శేషఫణిని హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వర రెడ్డి, వైద్యులు సన్మానించారు.

కర్నూలు(కల్చరల్): నగర శివారు గుత్తిరోడ్డులోని ఇండస్ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర నల్గొండ జిల్లా విశ్రాంత కలెక్టర్ వెలుగు ముక్తేశ్వరరావు హాజరై యోగా విశిష్టతను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన యో గా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్, సీఈఓ విల్సన్ అగస్టీన్, ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, కోఆర్డినేటర్లు రమణ, వేణుగో పాల్‌రెడ్డి, యోగా మాస్టర్లు బి.శ్రీనివాసులు, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా అధికారి మల్లు వేంకటరెడ్డి పాల్గొన్నారు.

● దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశా లలో, నగరంలోని వెంకటరమణ కాలనీలోని పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రం, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య హాజరై ప్రసంగించారు. యోగా శిక్షణ కేంద్రం కార్యదర్శి రేగూరు బాలకృష్ణ, ఇల్లూరు రంగస్వామి పాల్గొన్నారు.

● జి.పుల్లారెడ్డినగర్‌లోని విజ్ఞానపీఠం ఎయిడెడ్ ఉన్నత పాఠ శాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కుటుంబ ప్రబోధన్ కార్యకర్త రాంప్రసాద్ మాట్లాడారు. కార్యక్ర మంలో విజ్ఞానపీఠం వ్యాయామ ఉపాధ్యాయుడు రామిరెడ్డి, చంద్రమోహన్, రణధీర్ రెడ్డి, సుదర్శన్‌రావు, స్వర్ణలత పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): రాయలసీమ యూనివర్సిటీ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌యూ ఉపకులపతి బీ. సుధీర్ కుమార్ హాజరై మాట్లా డారు. కార్యక్రమంలో డీన్‌లు సుందరానంద పుచ్చా, ప్రిన్సిపాల్ హరినా థ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

● డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివా సులు, విద్యార్థులు, సిబ్బంది యోగాసనాలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సి పా ల్ ఎం.జహనారా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.వెంకటప్ప పాల్గొన్నారు.

కర్నూలు లీగల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ యోగాసనాలపై అవగాహన కల్పిస్తూ యోగా సాధన ద్వారా ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి వీలు కలుగుతుందని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయాధికారితోపాటు పలువురు న్యాయాధికారులు, న్యాయవాదులతో యోగా మాస్టర్, న్యాయ శాఖ ఉద్యోగి ముంతాజ్‌బేగం యోగాసనాలు చేయించారు.

కర్నూలు: స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా నిపుణులు ఇంటర్నేషనల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ, ఫారూల్ కురానా, కర్నూలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ లంక నాగరాజు, అదనపు ఎస్పీలు నాగరాజు, నాగబాబు, మహిళా డీఎస్పీ బాబు ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగరాజు యాదవ్, ఇంతియాజ్‌బాషా, పవన్ కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌతమి, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): నగరంలోని అన్ని కేశవరెడ్డి పాఠశా లల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగసనాలు వేశారు. ఈకార్యక్రమానికి కేశవరెడ్డి పాఠశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కేశవరెడ్డి హాజరై మాట్లాడారు.

● స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో పిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాసనాలపై అవ గాహన కల్పించారు. ముఖ్య అతిథిగా యోగా గురూజి అమ్రేష్ హాజరై ప్రసంగించారు.

● నగరంలోని ఏ.క్యాంపులో షైఫర్ ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.జే.రవికుమార్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్ పాల్గొన్నారు.

కర్నూలు(స్పోర్ట్స్): కర్నూలు గ్రూపు సౌజన్యంతో వన్ ఆంధ్ర మెడి కల్ కంపెనీ, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథగట్టుపై అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా మేజర్ వైవీకే చైతన్య రెడ్డి పాల్గొని మాట్లాడారు. యోగా మాస్టర్ కుమారి తేజశ్విని యోగాసనాలు నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు సుధీర్ విజయ్ కుమార్, ప్రతాప్, రఘు పాల్గొన్నారు.

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): నగరంలోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ పాయల్ ప్రియదర్శి ఆధ్వర్యంలో పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రామచంద్రమిషన్ ప్రతినిధులు రామశర్మ, చంద్ర హాజరై మాట్లాడారు.

● మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా యోగా గురువు బీటీ జయలక్ష్మి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్తా, పల్లెర్ల నాగరాజు పాల్గొన్నారు.

కల్లూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. కల్లూరు మండలం ఉలిందకొండ అమృత్ సరోవర్ సమీపంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్క రించు కుని ప్రజలకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉలిందకొండలో విద్యార్థులు, పొదుపు సంఘాల మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఓలు మద్దీశ్వరమ్మ, రమాదేవి, ఏపీఎం శ్రీనివా సులు, ఎంఈఓ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఈవీ రమణ, రంగస్వామిరెడ్డి పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ వీకర్‌సెక్షన్ కాలనీలోని జడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. నంద్యాల టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షురాలు కే.పార్వతమ్మ ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు లక్ష్మీనారాయణ, డాక్టర్ నాగేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు కే.జనార్దన్ ఆచారి, కే.శివరాఘవేంద్ర ఆచారి పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ సూచన మేరకు అధ్యాపకులు చంద్రశేఖర్, కోటేశ్వరిలు యోగాసనాల గురించి వివరిం చారు. నూతన విద్యార్థులు యోగాసనాలు, ధ్యానాన్ని అభ్యసించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సుంకన్న, మాధవిలత, ప్రసన్న కుమారి, రాధమ్మ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో మల్లేశ్వరి హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ప్రధానో పాధ్యాయుడు ప్రాణేష్‌కుమార్, నేషనల్ గ్రీన్ కో క్లస్టర్ కోఆర్డినేటర్ మద్దిలేటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌తోపాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని పులకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. చనుగొండ్ల ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యాధికారి హుసేన్‌బీబీ ఆధ్వర్యంలో యోగా శిక్షకులు నరేష్, శివరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





నన్నూరులో యోగా చేస్తున్న విద్యార్థులు, కోడుమూరులో, గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..



ఇండస్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



యోగాసనాలు వేస్తున్న దంత వైద్యులు



యోగాసనాలు వేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



యోగా చేస్తున్న పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రం సభ్యులు



ఉర్దూ వర్సిటీలో యోగా చేస్తున్న రిజిస్ట్రార్



కేశవరెడ్డి పాఠశాలలో..



యోగా చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, జూన్ 21: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారపేటకు చెందిన చెన్నయ్య (24) అనే యువకుడు తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి తండ్రి లేడు. తల్లి రామేశ్వరి కూలీ పనులు చేస్తూ జీవిస్తుంది. చెన్నయ్య గత కొద్ది కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. తండ్రి లేకపోవడంతో తరుచూ బాధపడుతుండేవాడని తల్లి పిర్యాదులో పేర్కొంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో సీలింగ్‌కు ఉన్న ఇనుము కొక్కేకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తర లించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

'కలం యోధుడు రామోజీరావు'

కర్నూలు(కల్చరల్), జూన్ 21: కలం యోధుడు రామోజీరావు అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. శుక్రవారం టీజీవీ కళాక్షేత్రంలో, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో, జిల్లా కన్వీనర్ నాగేంద్ర అధ్యక్షతన రామోజీరావు సంతాపసభ నిర్వహించారు. ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి గ్రూప్ సంస్థల అధినేత పెరుగు విజయవర్ధన్‌రెడ్డి, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ రామకృష్ణ, ఈటీవీ స్టాఫ్ రిపోర్టర్ శ్యామ్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ఓడినా నాయకులకు సిగ్గు రాలేదు

కర్నూలు(అర్బన్), జూన్ 21: వైసీపీని ప్రజలు చిత్తుగా ఓడించినా నాయకులకు సిగ్గు రాలేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన పాపాలు పండిపోయినందునే ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. కొడాలి, అంబటి, వంశీ, రోజా, పేర్ని వంటి వారు ఇంకా షాక్ నుంచి కోలుకోలేక మతిభ్రమించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు.

చంద్రబాబు శపథం నెరవేరింది

కర్నూలు(అర్బన్), జూన్ 21: ముఖ్యమంత్రి చంద్రబాబు శపథం నెరవేరిందని టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వి.హనుమంతరావు చౌదరి అన్నారు. శుక్రవారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మి పద్మ చౌదరితో కలిసి సమావేశం నిర్వహించారు. భువనేశ్వరిని అవమానించిన రోజు కౌరవ అసెంబ్లీ నుంచి వెళ్తున్న గౌరవ అసెంబ్లీలోనే అడుగు పెడతానంటూ చంద్రబాబు శపథం చేశారన్నారు. అన్న మాట ప్రకారం శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు.

ఖాళీ పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 21: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీవో 17ని రద్దు చేయాలి: జీవో 17ను రద్దు చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డీసీ.రహమాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక శాఖ కార్యాలయంలో ఉపకమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఏఐటీ యూసీ నగర ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి టి.రామాం జనేయులు, పాల్గొన్నారు.

బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన ఉండాలి

కోడుమూరు, జూన్ 21: ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు బ్యాంక్ లావాదేవీలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వర్క్ షాపు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీజీబీ మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

కల్లూరు, జూన్ 21: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని కల్లూరు రైతు సంఘం అధ్యక్షుడు సంపతి లక్ష్మీరెడ్డి, గ్రామపెద్దల ఆధ్వర్యంలో రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రైతులు కాడెద్దులను ప్రత్యేకంగా అలంకరించి బండ్లుకట్టి గ్రామంలో ఊరేగించారు. అనంతరం అలయాల్లో రైతులు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సంపతి లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవాలని పంటలు బాగాపండాలని ఆకాంక్షించారు. గ్రామపెద్దలు చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌వీ.రామకృష్ణ, పవన్‌కుమార్, వీరన్న పాల్గొన్నారు.

కోడుమూరు: ఖరీఫ్‌లో రైతులకు సకాలంలో ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.క్రిష్ణ డిమాండ్ చేశారు. ఏరువాక పున్నమి పురస్కరించుకొని శుక్రవారం పట్టణం సమీపంలోని రైతుల పంట పొలాల్లో సేద్యపు పనులు చేపట్టి ఎద్దులకు పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు అనుకూలించి పంటలు బాగా పండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిమ్మప్ప, చిన్న, నాగరాజు రైతులు వెంకటరాముడు, గొల్లమధు, వెంకటేశ్ పాల్గొన్నారు.

రెండో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మించాలి

కల్లూరు, జూన్ 21: కర్నూలు నగరంలో తాగునీటి అవసరాల కోసం రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరులోని సూర్య నారాయణభవన్‌లో కర్నూలు న్యూసిటీ కమిటీ సిహెచ్. సాయిబాబా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కల్లూరు అర్బన్ కాలనీలు కర్నూలు కార్పొరేషన్‌లో వీలినమై 25 ఏళ్లు అవుతున్నా ప్రజలకు తాగడా నికి నీరుకూడా సరఫరా చేయలేకపోతున్నారని ఆరోపించారు. రెండు మూడు రోజుల కొకసారి శుద్ధిచేయని నీటిని సరఫరా చేస్తూ అధికారులు పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు, సుదాకరప్ప, నరసింహులు, ప్రభాకర్, అరుణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పచ్చదనం పెరిగితేనే మానవ మనుగడ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 21: మానవ మనుగడ, పచ్చదనం పెంపుపైనే ఆధారపడి ఉందని కృష్ణానగర్ సహకార కేంద్ర బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని కల్లూరు సహకార సంఘం ప్రాంగణంలో మేనేజర్ శ్రీనివాసులు, పర్సన్ ఇన్‌చార్జి నాగ రమణయ్య, సంఘం కార్యదర్శి పుల్లయ్య, సూపర్‌వైజర్లు నాగరాజు, శ్రీనివాసులు తదితరులు మొక్కలు నాటారు.

పాఠశాలకు గేటు విరాళం

కోడుమూరు(రూరల్), జూన్ 21: మండలంలోని వర్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి ఇనుప గేటు చేయించారు. పాఠశాల హెచ్‌ఎం రఘురామిరెడ్డి మాట్లాడుతూ దాత సూర్యనారాయణరెడ్డి తన తండ్రి మల్లారెడ్డి గారి రామిరెడ్డి జ్ఞాపకార్థం పాఠశాల ప్రధాన గేటు చేయించారని, ఇందుకోసం రూ.లక్ష ఖర్చు చేశారని తెలిపారు.

ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 21: ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని ఏఐఎస్ ఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సంక్షేమ భవన్ ఎదుట విద్యార్థులతో ఖాళీ పెట్టెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న మాట్లాడుతూ కర్నూలు నగరంలో మూసివేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మ్మను కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు.

హక్కుల కోసం పోరాడుదాం

కర్నూలు(అర్బన్), జూన్ 21: బీసీల హక్కుల సాధన కోసం పోరాడాలని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు నగరంలోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిలిచిపోయిన బీసీ భవనాలను వెంటనే నిర్మించాలని, బీసీ కార్పొరే షన్‌కు పాలక మండలి నిధులు ఇవ్వాలని కోరారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుం జయ్ ఆచారి, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి శ్రీకారం

ఓర్వకల్లు, జూన్ 21: ఓరక్వల్లు మండలంలో మొక్కల పెంపకానికి ఎంపీడీవో మల్లేశ్వరి శ్రీకారం చూట్టారు. కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లో 10 వేల మొక్కలు నాటేందుకు ఎంపీడీవో మల్లేశ్వరి పూనుకున్నారు. శుక్రవారం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో చెట్ల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ అని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, తదితర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా 7వేల మొక్కలు నాటామన్నారు.

జొన్నగిరిలో వజ్రం లభ్యం

తుగ్గలి, జూన్ 21: జొన్నగిరిలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతుకు శుక్రవారం విలువైన వజ్రం లభ్యమైంది. దీంతో స్థానిక వజ్రాల వ్యాపారి రూ.2.90 లక్షలు, రెండు తులాల బంగారం ఇచ్చి కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసినప్పుడు ఈ ప్రాంతంలో విరివిగా వజ్రాలు దొరకుతూ ఉంటాయి. అయితే, విత్తన సమయంలో పంట పొలాల్లోకి వస్తే పంటలు నాశనం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను గుర్తించండి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 21: పట్టణంలోని ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులను గుర్తించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గౌసు, శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శిశిరదీప్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను చెందిన బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని, వెంటనే గుర్తించి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మోహన్, సూరి, యశ్వంత్, రవితేజ, నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ పై విచారణ జరిపించాలి

ఆదోని టౌన్, జూన్ 21: నీట్ ప్రశ్న పత్రాలను కొందరు పెద్దలు లీక్ చేయించి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, పేపర్ లీకేజీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించి దోషుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాయిప్రసాద్‌రెడ్డిపై సీబీఐతో విచారించాలని సీఎంకు వినతి

ఆదోని, జూన్ 21: ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నియోజకవర్గంలో చేసిన అక్రమాలపై సీబీఐ చేత విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి శుక్రవారం సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు. ఎన్నో అక్రమాలకు పాల్పడి, భూదందాలు, కబ్జాలు, ఇసుక దోపిడీ చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చినా, వాటిని పక్కదారి పట్టించారన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

పత్తికొండ టౌన్, జూన్ 21: పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించాలని ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పెద్దయ్య, హనుమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారికి ఏఐవైఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఆసుపత్రిలో గర్భిణులకు నెలకొకసారి స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, దీన్ని వారానికి రెండు రోజులు స్కానింగ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు చిరంజీవి, వినోద్, శివ, రవి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

మద్దికెర, జూన్ 21: మండలంలోని రైతులు సాగుచేసే వ్యవసాయ పొలాల్లో భూసార పరీక్షలు చేయించాలని వ్యవసాయాశాఖ అధికారి ఉప్పర రవి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ సిబ్బంది పొలాల్లో పర్యటించి మట్టి సేకరణ చేయాలని ఆదేశించారు.

వెల్దుర్తి వీఆర్వోపై ఫిర్యాదు

వెల్దుర్తి, జూన్, 21 : పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వెల్దుర్తి వీఆర్వోపై అదే గ్రామానికి చెందిన బోయ రంగస్వామి లిఖిత పూర్వకంగా జూనియర్ అసిస్టెంట్ మేరిజూలీకి ఫిర్యాదు చేశారు. 442 సర్వేనెంబరులో 2 ఎకరాలకు పాసుపుస్తకం జారీచేయడానికి డబ్బు చెల్లించామని, ఇంత వరకు తమ సమస్యకు పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిని వీఆర్వోను ఫోన్‌లో సంప్రదించగా అవాస్తవమని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం

వెల్దుర్తి, జూన్, 21 : ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూమి సారవంతం కావడంతో పాటు రైతులకు ఆదాయం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం రామళ్లకోట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులందరికీ పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో భుజేశ్వరుడు, మల్లికార్జున, సుధాకర్, మాబువలి, వెంకటస్వామి, రామచంద్రుడు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

మంత్రాలయం, జూన్ 21: మంత్రాలయం మండలంలోని వీ.తిమ్మాపురం గ్రామానికి చెందిన నరసింహులు కొడుకు శివన్న (49) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు బంధువులు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల నుంచి కనిపించకుండా ఎటో వెళ్లిపోయారని బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంధువులు, స్నేహితు దగ్గర విచారించినా ఆచూకి లభ్యం కాకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపినాథ్ తెలిపారు.

తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లకు పరిమితం చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 21: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సీ నాగరాజు కోరారు. శుక్రవారం స్థానిక నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లకు పరిమితం చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

పెద్దకడుబూరు, జూన్ 21: మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ రంగన్న శుక్రవారం తెలిపారు. 8,9 తరగతులలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటి కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇదీ పేదల బండికాదు.. పెద్దోళ్లదండీ

- ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రైతు కూలీలకు నో ఎంట్రీ
- 1300 మంది కూలీలను అడ్డుకున్న అధికారులు
- కోసిగి రైల్వేస్టేషన్‌లో రైతు కూలీల ఆవేదన



ఎక్స్‌ప్రెస్ రైళ్లోకి అనుమతించకపోవడంతో ప్లాట్‌ఫాంపైనే నిలిచి ఉన్న రైతు కూలీలు

కోసిగి, జూన్ 21: స్థానికంగా పనులు లేకపోవడంతో వివిధ గ్రామాల రైతు కూలీలు ఇతర రాష్ట్రాల్లో పనుల కోసం బతుకు పయనం సాగిస్తున్నారు. కోసిగి రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజూ 1500 నుంచి 2000 మంది కూలీలు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఉదయం 8 గంటలకు కోసిగి నుంచి రాయచూరు ఇతర ప్రాంతాలకు కూలీ పనులకు వెళ్తారు. అయితే, రైల్వే అధికారులు రెండు రోజులుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కూలీలను అనుమతించడంలేదు. శుక్రవారం సుమారు 1300 మందికి పైగా మూడు మండలాలకు చెందిన రైతు కూలీలు ఉసూరు మంటూ వెంట తెచ్చుకున్న సామాన్లతో ఇళ్లకు వెళ్లిపోయారు. రైల్వే అధికారుల తీరుతో రైతు కూలీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "కూలి పని చేస్తే గానీ కుటుంబం గడిచే పరిస్థితి లేదు. మేము కూలి పనుల కోసమే ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం.. జల్సాలకు, వ్యాపారాలు చేసేందుకు కాదు.. అయినా, మా మీద రైల్వే అధికారులకు కనికరం లేదు" అంటూ రైతు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే అధికారుల తీరుతో రెండు రోజులుగా పనులకు వెళ్లకుండా ఇంటికి వెనుదిరిగి వెళ్తున్నారు. రైల్వే అధికారులు మాత్రం ప్రయాణీకుల సౌకర్యం దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కూలీలు రిజర్వేషన్లు ఎక్కడం నేరమని తెలిపారు. రిజర్వేషన్ ఉంటేనే ప్రయాణించవచ్చని, లేకపోతే ప్రయాణాలు చేయడం నేరమని పేర్కొన్నారు. ప్రయాణీకుల ఫిర్యాదు మేరకే అడ్డుకున్నామని తెలిపారు. కోసిగి మండలంతో పాటు కౌతాళం, పెద్దకడుబూరు మండలాల నుంచి ప్రతి రోజూ వందలాది మంది కూలీలు పొట్ట చేతపట్టుకొని రాయచూరులో పనులు చేసేందుకు వెళ్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి తమకు ప్రయాణాలు సాగించే అవకాశం కల్పించాలని రైతు కూలీలు వేడుకుంటున్నారు.

ఘనంగా ఏరువాక పున్నమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా ఏరువాక పున్నమి వేడుకలను రైతులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎద్దులకు స్నానాలు చేయించి రంగులు వేసి, ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం వేళ ఆయా గ్రామాల మైదానాల్లో రైతులకు సంబంధించిన ఎద్దుల పారువేట పోటీలు నిర్వహించారు. విజేతలైన ఎద్దులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.



పత్తికొండలో ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏరువాక పౌర్ణమిని అధికారికంగా నిర్వహించాలి

పత్తికొండ టౌన్ జూన్ 21: దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు నిర్వహించే ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కొండగేరి ప్రాంత సమీపాన ఉన్న రైతు రవి పొలంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాడెద్దులతో నాగలిని పట్టి రామచంద్రయ్య పొలాన్ని దున్ని ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహేబ్, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, రవికుమార్, సుంకన్న, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆస్పరి : మండలంలో ఏరువాక పున్నమిని రైతులు ఘనంగా నిర్వహించారు. కైరుప్పలలో పున్నమి సందర్భంగా ఎద్దుల పారువేట ఉత్సాహంగా నిర్వహించారు. రైతులకు రంగులు వేసి అలంకరించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన ఆలయాల్లో పూజలు చేశారు.

పెద్దకడుబూరు : మండల కేంద్రంలో ఏరువాక రైతు మహోత్సవం కార్యక్రమం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ అధ్యక్షతన అరకు దున్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ కొత్త ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సబ్సిడీ కింద రైతులకు ఎద్దుల బండి, నాగలి గుంటక వివిధ ఉపయోగపడే సామాగ్రిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వెల్దుర్తి : అల్లుగుండు గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం పొలం దున్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రైతులకు మంచి పథకాలు తేవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ, రాజు, చిన్నమాదులు, చిలిపికృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆదోని టౌన్, జూన్ 21: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిరోజూ యోగా ఆసనాలను వేయడం ఎంతో అవసరమని ప్రముఖ యోగా గురువు వేణుగోపాల్ అన్నారు. అంతర్జాతీయ 10వ యోగ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ మైదానంలో శుక్రవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఆసనాలను ప్రతిరోజూ అవలంబిస్తే మనకు అవసరమైన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఏ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, రాష్ట్ర కార్యవర్గం ప్రత్యేక ఆహ్వానితుడు విట్టా రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మంత్రాలయం ఉన్నత పాఠశాలలో యోగా నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

హాలహర్వి : మానవ జీవితం సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలంటే యోగాతోనే సాధ్యమని బాపురం సర్పంచు బాగ్యాలక్ష్మీ అన్నారు. పీఎం వాటర్ షెడ్ కింద ఉపాధిహామీ కూలీలతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎస్వో వలీబేగ్, గోవిందప్ప, పార్థన్న పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

ఆదోని (అగ్రికల్చర్) : ఆదోని పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ గోవిందు యోగ విశిష్టతను తలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మురళి మోహన్ ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాధన్, ఉమాదేవి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా దేవి, ఫిజికల్ డైరెక్టర్ రామన్న, విద్యార్థులతో యోగా ఆసనాలు చేయించారు.

పత్తికొండ టౌన్ : పత్తికొండ పట్టణంలో పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. యోగా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జడ్జి ఎంఎస్ భారతితో పాటు బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు రంగస్వామి, న్యాయవాదులు, ఉద్యోగులు యోగాసనాలు చేశారు.

విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ నిర్ణయం అభినందనీయం

పెద్దకడుబూరు, జూన్ 21 : ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ సైతం పంపిణీకి చర్యలు చేపట్టడం అభినందనీయమని టీడీపీ నాయకులు బొగ్గుల తిక్కన్న, రామన్న తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రంగన్నను మోడల్ స్కూల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసినందుకు గాను ఆయనను టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలతో పాటు, మంచి రాజకీయ పదవులు చేపట్టాలన్నారు. తరగతి నాలుగు గోడల మధ్యనే నవభారత నిర్మాతలను తయారు చేస్తున్న ఉపాధ్యాయులకు, లెక్చరర్ల కృషి ఎంతో గొప్పదని, అలాంటి ఖ్యాతి ఉపాధ్యాయులకే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దినకరన్, జంబన్న పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ రంగన్నను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం

- పత్తికొండ, ఆలూరు, ఆదోని శాసన సభ్యులు కేఈ శ్యాంబాబు , విరుపాక్షి, డాక్టర్ పార్థసారథి ప్రమాణ స్వీకారం

ఆదోని, జూన్ 21: శాసనసభకు ఎంపికైన ఎమ్మెల్యేలు ప్రోటెమ్ స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ శుక్రవారం ప్రారంభం కాగానే ఎన్నికల్లో ఎన్నికైన ఎమ్మెల్యేలు హాజరయ్యారు. నిబంధనల ప్రకారం ప్రోటెమ్ స్పీకర్ ఎమ్మెల్యేల నియోజకవర్గం అనుగుణంగా పిలవడంతో ఈ ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలు జిల్లా నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు ఎన్నిక కాగా శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. రెండు రోజులు పాటు శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడంతో జిల్లా నుంచి ఎంపికైన ఎమ్మెల్యేలు ఈ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. ఆదోని నుండి కూటమిలో భాగంగా బీజేపీ తరపున ఎంపికైన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి, ఆలూరు నుండి వైసీపీ తరుపున ఎంపికైన ఎమ్మెల్యే విరుపాక్షి ప్రమాణ స్వీకారం చేశారు.

కేఈ శ్యాంబాబు ప్రమాణ స్వీకారం

పత్తికొండ : పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మరికొన్ని గ్రామాల్లో బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

తుగ్గలి : తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి అభినందనలు తెలిపారు. శుక్రవారం తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసేందుకు వెళ్తున్న కేఈ శ్యాంబాబును వారు కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువ కప్పి సన్మానం చేశారు. అలాగే ఆయనతో పాటు అసెంబ్లీ వరకు ర్యాలీగా వెళ్లారు. అలాగే మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిలను కలిసి సన్మానం చేశారు.



కేఈ శ్యాంబాబును సన్మానిస్తున్న తుగ్గలి నాగేంద్ర

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రమాణం

ఆలూరు : ఆలూరు ఎమ్మెల్యేగా బీ విరుపాక్షి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పుతానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి మృతి

ఆదోని, జూన్ 21: చిప్పగిరి మండలం నగరడోణ గ్రామానికి చెందిన బాబు (32) శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇస్వి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. నగరడోణ గ్రామానికి చెందిన ఆంజనేయులు కుమారుడు బాబు (33) బేల్దారి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదోని పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. బంధువులను కలిసేందుకని శుక్రవారం తమ స్వగ్రామమైన నగరడోణకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. నారాయణపురం గ్రామం సమీపాన ఉన్న మలుపులో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఇస్వీ ఎస్సై శ్రీనివాసులు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు, ముగ్గురు మగ బిడ్డలు ఉన్నారు.

పంటలపై సోకే పురుగులను నివారించుకోండి ; ఏఓ

దేవనకొండ, జూన్21: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వేరుశనగ, పత్తి పంటలపై రసం పీల్చు పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ పంటలకు ఆశిస్తున్నాయని, వాటి నివారణకు మందులు పిచికారి చేయాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తిలో ఆశించిన పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చు పురుగుల నివారణకు థైమాక్సన్ గానీ, ఇమిడా క్లోప్రిడ్ 1.5ఎం.ఎల్, అసిఫెట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని మొక్కలపై బాగా తడిచేటట్లు పిచికారి చేసుకోవాలని సూచించారు.

జీవో నెం 117 ను ప్రభుత్వం రద్దు చేయాలి

గోనెగండ్ల, జూన్ 21: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న జోవో నెం 117 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యరంగంలో సంస్కరణ ల పేరుతో గత ప్రభుత్వం అమలు చేసిన జీవో 117తో విద్యరంగంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని పాఠశాలలు విలీనం చేయడం వల్ల పాఠశాల వ్యవస్థ బలహీన పడిందన్నారు. ఈ కారణం చేత 14వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు గా మిగిలిపోయాయని తెలిపారు. సమావేశంలో మద్దిలేటి, చంద్రపాల్, నాగేశ్వర రావు, విజయ్‌కుమారి, అక్బర్, వేణుగోపాల్, లింగన్న, లక్ష్మణ్, మద్దిలేటి, తిరుమలేష్, పాల్గొన్నారు.

గోనెగండ్లలో మెదడువాపు వ్యాధి నమోదు

గోనెగండ్ల, జూన్ 21: మండల కేంద్రంలోని ఒకటవ సచివాలయం పరిధిలో మెదడు వాపు వ్యాధి నమోదు అయినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. చిన్న పిల్లవాడిని కర్నూలులో వైద్యపరీక్షలు నిర్వహించి మెదడు వ్యాపు వ్యాధిగా గురించినట్లు ఆయన తెలిపారు. దీంతో గోనెగండ్లలో పర్యటించి మురికి నీరు నిలువ ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు గాను దోమల నివారణ మందును పిచికారి చేయించారు. ఒకటవ సచివాలయంలో పరిధిలోని కాలనీ 60 మంది వాసులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, ఈవోఆర్‌డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శి సతీష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

- కత్తితో దాడి, ఇద్దరు యువకులకు తీవ్రగాయలు

ఎమ్మిగనూరు, జూన్21: పట్టణ శివారులో ఉన్న దర్గ ఉరుసు ఉత్సవంలో యువకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొని ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ముగ్గురు యువకులు కత్తిపోట్లకు గురయ్యారు. పట్టణ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పట్టణానికి చెందిన సైపుల్లా, సల్మాన్‌కు పాతగొడవలు ఉన్నాయి. గురువారం రాత్రి దర్గ ఉత్సవంలో ఇరువర్గాలకు చెందిన వారు ఎదురు పడ్డారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారి తీసింది. స్థానికులు ఇరువురిని వారించి సర్దిచెప్పి పంపారు. ఉరుసు దగ్గర నుంచి పట్టణంలోకి తిరిగి వస్తున్న సైపుల్లా, రజాక్, జక్కావలిలను స్థానిక గోనేగండ్ల సర్కిల్ పెట్రోల్ బంకు దగ్గర అప్పటికే కాపు కాచిన సల్మాన్,తౌఫిక్, అబ్దుల్లా, వాసిన్, వసామా, ఉస్మాన్‌లో ఒక్కసారిగా కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో సైపుల్లా, రజాక్, జక్కావలికి రక్తగాయాలయ్యాయి. దాడికి పాల్పడిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. గాయాలపాలైన వారిని స్థానికులు చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టైర్ల దొంగలపై కేసు నమోదు

- విచారణ చేస్తున్న పోలీసులు

మంత్రాలయం, జూన్ 21: మంత్రాలయం పుణ్యక్షేత్రంలో పార్కింగ్ చేసిన వాహనాల టైర్లను ఎత్తుకెళ్తున్న దొంగలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. ఈ నెల 19న అర్ధరాత్రి మంత్రాలయానికి చెందిన పరమేశ్ వాహనాన్ని రాత్రి పంచముఖి దర్శన్ ముందు పార్కింగ్ చేసి డ్యూటీలో ఉండగా.. తెలంగాణ, కర్ణాటకకు చెందిన నలుగురు వ్యక్తులు ఖరీదైన కారులో వచ్చి రాత్రిపూట టైర్లను విప్పి రాయచూరులో అమ్ముకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయమై చోరీకి ఉపయోగిస్తున్న కారును స్వాధీనం చేసుకుని ఆ నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంతంగా పంచాయతీ వేలాలు

కోసిగి, జూన్ 21: కోసిగి మేజర్ పంచాయితీ వేలాలు శుక్రవారం గ్రామ సర్పంచు కుమారి సంజీపోగు అయ్యమ్మ, ఈవో తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో వేలాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్‌పీవో నూర్జహాన్ హాజరయ్యారు. వారపు సంత రూ.1.30 లక్షలకు చింతలగేని నర్సారెడ్డి దక్కించుకున్నారు. అలాగే బండిమెట్ట రూ.6.90 లక్షలకు చింతలగేని నర్సారెడ్డి కైవసం చేసుకున్నారు. చిన్నకమేలా నూర్‌బాషా రూ.31వేలకు, పెద్ద కమేలా ఎస్.రాజేష్ రూ.20వేలకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలీస్తే భారీగా పంచాయితీకి ఆదాయం తగ్గినట్లు డీఎల్‌పీవో నూర్జహాన్ తెలిపారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

మంత్రాలయం, జూన్ 21: నియోజకవర్గ జనసేన కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఆ పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్యవాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. శుక్రవారం మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసేన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో కౌతాళం జనసేన నాయకులు చిన్న, సుమిత్ర, ఎర్రిస్వామి, మంజునాథ్ పాల్గొన్నారు.

శ్రీ మఠం గోశాలకు రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జూన్ 21 : రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు బెంగుళూరుకు చెందిన వెంరటరమణ అనేభక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని గోశాల సంరక్షణకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటు

కౌతాళం, జూన్ 21: మండల కేంద్రానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు బొంబాయి బాబు(45) మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, టౌన్ అధ్యక్షుడు కాశివిశ్వనాథలు అన్నారు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాబు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మట్టి ఖర్చులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజుబాబు, శివ ఉన్నారు.

ఆలూరు ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షకార్యదర్శుల ఎన్నిక

ఆలూరు, జూన్ 21: ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షకార్యదర్శులుగా ఐ న్యూస్ రిపోర్టర్ గోపాల్, స్వతంత్ర టీవీ రిపోర్టర్ వీరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో తాలూకా అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముందు ఉన్న అధ్యక్షకార్యదర్శులు వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేయడంతో నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు.